క్లుప్తంగా

వేడుకగా హోమం


అభిషేకం చేస్తున్న అర్చకులు

తడ: మండలంలోని బీవీఎల్‌పాడులో ఉన్న సీతా రామలక్ష్మణ, ప్రసన్నఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా మంగళవారం మహాకుంభాభిషేక హోమం చేశారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు అభిషేకం జరిపారు.

క్రీడల్లో ప్రావీణ్యం సాధించాలి


బహుమతులు అందజేస్తున్న డాక్టర్ రోహిణి, ధనుంజయరెడ్డి

గూడూరు: పిల్లలు విద్యతోపాటు, క్రీడల్లోనూ ప్రావీణ్యం సాధించాలని సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షురాలు రోహిణి అన్నారు. తాళమ్మ దేవాలయ సమీపంలో హర్ష, దీపు ఏర్పాటు చేసిన ఇండోర్ స్టేడియం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా రోటరీ వెస్ట్ గూడూరు క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం షటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ రోహిణి మాట్లాడుతూ గూడూరు పట్టణంలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బండి ధనుంజయరెడ్డి, కోట రామారావు, గిరి, వాసు గౌడ్, జమాలుల్లా, నాగేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికకే గ్రామసభలు


మాట్లాడుతున్న ఎంపీపీ రఘురెడ్డి

తడ: ప్రభుత్వం భూ పంపిణీ చేయడానికి లబ్ధిదారుల గుర్తించడానికే గ్రామసభలు ఏర్పాటు చేసిందని ఎంపీపీ రఘురెడ్డి అన్నారు. మండలంలోని బీవీ పాళెం, పెరియవట్టు, పూడి పంచాయతీల్లో మంగళవారం తహసీల్దార్ రామయ్య ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం


అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

గూడూరు: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పాణకా శివకుమార్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కల్యాణ వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం అన్నదానం చేశారు. నిర్వాహకులుముని మోహన్ మాట్లాడుతూ శివకుమార్‌రెడ్డి సతీమణి, స్వర్ణాంధ్ర కార్పొరేషన్ చైర్ పర్సన్ పాణకా దేవసేనమ్మ దాతృత్వంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు.

పాఠశాలకు వాటర్ కూలర్ వితరణ


కూలర్‌ను అందజేస్తున్న దాత హరినాథ్

చిల్లకూరు: మండలంలోని వరగలి జెడ్పీ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి వాటర్ కూలర్‌ను మంగళవారం వితరణ చేశారు. అలాగే పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్‌లు, జామిట్రీ బాక్సులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శివసుబ్రహ్మణ్యం, సీఆర్పీ ఏడుకొండలు పాల్గొన్నారు.

సైదాపురంలో కుర్చీలు..

సైదాపురం: మండల కేంద్రంలో సైదాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు మంగళవారం పూర్వ విద్యార్థి కాలంశెట్టి హరిబాబు 10 కుర్చీలను వితరణ చేశారు. కుర్చీలను హెచ్ఎం పార్వతమ్మకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు అస్మత్ బేగం, కామిశెట్టి శ్రీనివాసులు, గంగాధర్‌రావు పాల్గొన్నారు.

రోగనిరోధక శక్తి అధికం


చిరుధాన్యాల ప్రదర్శనలో పాల్గొన్న మహిళలు

పెళ్లకూరు: చిరుధాన్యాల్లో రోగనిరోధకశక్తి అధికంగా ఉంటుందని ఎంఈఓ సుబ్రమణ్యం పేర్కొన్నారు. మంగళవారం పెళ్లకూరులోని అంగన్ వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో మిల్లెట్ మహోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాగులు, సజ్జలు, పెసర, మినుము, నువ్వులు, వేరుశనగ, మొక్కజొన్న తదితర చిరు ధాన్యాలతో ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంకమ్మ, హెచ్ఎం ఎస్ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అతివలకే అగ్ర తాంబూలం

• ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు


సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న పొదుపు మహిళలు, చిత్రంలో ఎమ్మెల్యే వరప్రసాద్ రావు

వాకాడు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని సంక్షేమ పథకాల్లోనూ మహిళలకే అగ్ర తాంబూలం వేసి మహిళా పక్షపాతిగా నిలుస్తున్నారని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తొలుత మండలంలోని 614 పొదుపు గ్రూపులకు సంబంధించి 5,999 మంది సభ్యులకు మంజూరైన రూ.4.12 కోట్లకు సంబంధించిన మెగా చెక్కు నమూనను ఎమ్మెల్యే మహిళలకు అందజేశారు. అనంతరం పొదుపు మహిళలతో కలసి సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు పొదుపు మహిళలను మోసం చేశారన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి మాత్రం నాడు ఇచ్చిన మాటకు కట్టుబడి నేడు విడతల వారీగా రుణ మాఫీ చేసి, మహిళలను ఆదుకుంటున్నారన్నారు. కొందరు టీడీపీ నాయకులు కల్లు తాగిన కోతి గంతులేసినట్లుగా చేస్తున్నారని అన్నారు. గతంలో ఎన్నికల సమయంలో మహిళలను మభ్యపెట్టడానికి పసుపు కుంకుమ పేరుతో చంద్రబాబు ఆడిన డ్రామాలను మహిళలు తిప్పికొట్టారన్నారు. మహిళలే వైఎస్సార్‌సీపీ బలం, బలగం అన్నారు. ఈ కార్యక్రమంలో వాకాడు సొసైటీ చైర్మన్ కొడవలూరు దామోదర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రాజు రామకృష్ణ, ఏఎంసీ చైర్‌పర్సన్ వాకాటి నాగభూషణమ్మ, నాయకులు అజిత్‌రెడ్డి, కోటిరెడ్డి, మధురెడ్డి, వెంకటరమణయ్య, వెంకటరత్నం, అనిల్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, సుధాకర్‌నాయుడు, కిరణ్‌రెడ్డి, రవి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కొండంత అండ


చిట్టమూరు: చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

చిట్టమూరు: వైఎస్సార్ ఆసరా ద్వారా మహిళలకు కొండంత అండగా వైఎస్సార్‌సీపీ నిలుస్తుందని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు తెలిపారు. చిట్టమూరులో మంగళవారం వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయ ఆవరణలో పొదుపు మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిట్టమూరు మండలంలో మొత్తం 610 గ్రూపుల్లోని 6,148 మందికి వైఎస్సార్ ఆసరా కింద రూ.4.41కోట్లను మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు చొప్పల వెంకటయ్య, నాయకులు దువ్వూరు శేషురెడ్డి, మధురెడ్డి, వంకా రమణయ్య, సాయిరెడ్డి, మధుయాదవ్, గజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు


సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

• ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

ఓజిలి: కుల, మత, రాజకీయాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ ఆసరా చెక్కులను ఎమ్మెల్యే మంగళవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో పొదుపు సంఘాలకు ఇప్పటి వరకు రూ.19,200 కోట్లు నిధులు మంజూరు చేశారన్నారు. ఓజిలి మండలంలో రూ.4.80 కోట్లు చెక్కులను పొదుపు మహిళలకు అందించామన్నారు. అలాగే రాష్ట్రంలో పేదలకు 30 లక్షల మందికి ఇళ్ల పట్టాలను సీఎం అందించారని, వీటిలో 15 లక్షల ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయయన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఇళ్ల స్థలాలను ఇస్తుంటే ప్రతిపక్షనేత చంద్రబాబు కోర్టులకు వెళ్లి వాటిని అడ్డుకోవాలని పన్నాగాలు పన్నారని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్న ప్రతిపక్ష నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అనంతరం పొదుపు సంఘాల మహిళలతో కలసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

రౌడీయిజాన్ని ప్రోత్సహించను

నియోజకవర్గంలో రౌడీయిజాన్ని ప్రోత్సహించనని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో అల్లరి మూకలు శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గర్లం అరుణారెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షురాలు ఉచ్చూరు శోభారాణి, ప్రధాన కార్యదర్శి బాబురెడ్డి, కార్యదర్శులు దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, పాదర్తి హరనాథ్‌రెడ్డి, కనుమూరు గోపాల్‌రెడ్డి, ముమ్మడి సుబ్బరావుయాదవ్, ఉచ్చూరు హరనాథ్‌రెడ్డి, పిండుకూరు మధుసూదన్‌రెడ్డి, యల్లా సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయొద్దు


మాట్లాడుతున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

గూడూరు: తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయవద్దని, మిమ్మల్ని పెంచి పోషించిన వారిని కన్నబిడ్డల్లా చూసుకోవాలని ఆర్డీఓ కిరణ్‌కుమార్ అన్నారు. సబ్ కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన వయో వృద్ధుల సంరక్షణ చట్టాలపై డివిజన్‌స్థాయి సమావేశం నిర్వహించారు. తొలుత వయో వృద్ధుల సంరక్షణ చట్టాలను తెలిపే కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తల్లిదండ్రులు, వయోజనుల సంరక్షణ కోసం కొన్ని ప్రత్యేక చట్టాలను తీసుకువచ్చిందన్నారు. తల్లిదండ్రులను ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.

పౌష్టికాహారంతోనే ఎదుగుదల


వెంకటగిరి: పోషణ్ పక్వాడలో పాల్గొన్న సీడీపీఓ

వెంకటగిరి: పౌష్టికాహారంతోనే చిన్నారులకు ఆరోగ్యవంతమైన ఎదుగుదల ఉంటుందని సీడీపీఓ షంషాద్‌బేగం తెలిపారు. వెంకటగిరి ఐసీడీఎస్ పరిధిలోని బంగారుపేట, బొప్పాపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పోషణ్ పక్వాడ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి పాల్గొన్నారు.


సైదాపురం: మాట్లాడుతున్న సీడీపీఓ

అవగాహన అవసరం

సైదాపురం: పౌష్టికాహారంపై అవగాహన అవసరమని రాపూరు సీడీపీఓ సునంద పేర్కొన్నారు. సైదాపురం, పాలూరు అంగన్ వాడీ కేంద్రాల్లో మంగళవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ సౌజన్య పాల్గొన్నారు.

రీ సర్వేకి సహకరించాలి

నాయుడుపేటటౌన్: మున్సిపాలిటీలో బుధవారం నుంచి రెవెన్యూ అధికారుల బృందం జరిపే డ్రోన్ రీ సర్వేకి ప్రజలు సహకరించాలి కమిషనర్ ఐ శ్రీనివాసనావు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి డ్రోన్‌లతో రీ సర్వే కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. పది రోజులు పాటు మున్సిపల్ పరిధిలో సర్వే పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

నేడు చెక్కుల పంపిణీ

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): బాలాయపల్లి మండలంలోని పొదుపు మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కులను బుధవారం పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ స్వరూపరాణి పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పొదుపు సంఘాల మహిళలు పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

రామాలయం ప్రారంభం


ఆలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ మురళీధర్

గూడూరురూరల్: మండలంలోని ఈదలపల్లెలో నిర్మించిన నూతన రామాలయాన్ని సోమవారం రాత్రి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ కార్యదర్శి బట్టా గోపీ యాదవ్‌లను నాయకులు, గ్రామస్తులు సత్కరించారు. ఎంపీపీ బూదూరు గురవయ్య, 24 సొసైటీ అధ్యక్షుడు అట్ల శ్రీనివాసులురెడ్డి, యల్లా శ్రీనివాసులురెడ్డి, సుబ్బానాయుడు, చంద్రమౌళి పాల్గొన్నారు.

పోలేరమ్మ హుండీ లెక్కింపు నేడు

వెంకటగిరి: గ్రామశక్తి పోలేరమ్మ ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమం పాతకోటలోని రామమందిరం ఆవరణలో బుధవారం నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈఓ ఏ శ్రీనివాసులురెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.00 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొనాలని కోరారు.

ఘనంగా సరస్వతి పూజలు

చిల్లకూరు: మండలంలోని తిక్కవరం, వరగలి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు మంగళవారం సరస్వతీదేవికి ఘనంగా పూజలు చేశారు. ఉపాధ్యాయుల ఆశీర్వచనాలు పొందారు. అలాగే హాల్‌టికెట్లను అందుకున్నారు. విద్యార్థులు స్కూలు వదలి వెళ్లనుండడంతో ఆటో గ్రాఫులు, సెల్ఫీలు తీసుకుని సంబరాలు చేసుకున్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

చిల్లకూరు: మండలంలోని తమ్మినపట్నంలో ఉన్న కోదండరామస్వామి ఆలయంలో మంగళవారం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ చైర్‌పర్సన్ యరటపల్లి సాయిప్రద్వీరెడ్డి, ఈఓ కోవూరు జనార్దనరెడ్డి మాట్లాడుతూ మంగళవారం నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. 30వ తేదీ సీతారాముల కల్యాణం, అన్నదానం, కోలాట ప్రదర్శనలుంటాయని తెలిపారు. రాత్రి గజ వాహన సేవ జరుగుతుందన్నారు.

పంచలోహ విగ్రహాల బహూకరణ

సైదాపురం: మండల కేంద్రంలోని రామాలయానికి గ్రామానికి చెందిన జగన్‌మోహన్‌రెడ్డి, అజిత కుటుంబ సభ్యులు మంగళవారం పంచలోహ విగ్రహాలను బహూకరించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు.

5న కోట-అరుణాచలం ప్రత్యేక బస్సులు

కోట: పౌర్ణమి సందర్భంగా ఏప్రిల్ 5వ తేదీ అరుణాచలం(తిరువణ్ణామలై)గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం కోట నుంచి రెండు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు వాకాడు ఆర్టీసీ డిపో మేనేజర్ మధుశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కోటలో ఆయన మాట్లాడుతూ ఉదయం 8, 11 గంటలకు కోట ఆర్టీసీ బస్టాండ్ నుంచి బస్సులు బయలు దేరుతాయన్నారు.

అవగాహన పెంచుకోవాలి

నాయుడుపేటటౌన్: సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడే చిరుదాన్యాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి అన్నారు. చిరుధాన్యాల మహోత్సవ కార్యక్రమాన్ని స్త్రీశక్తి భవనంలో మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలతో వివిధ రకాల వంటలు తయారు చేసిన మహిళలకు బహుమతులను ప్రదానం చేశారు. సీసీఎస్‌లు మురళి, సుభాషిని, మణెమ్మ, రెడ్డెమ్మ, జయకుమారి తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం తనిఖీ

రాపూరు: మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ ధనమ్మ మంగళవారం తనిఖీ చేశారు. కేంద్రంలో విద్యార్థులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట సహిత విద్యబోధకులు నరసింహులు, చాందిని, రమీజ్, మస్తానమ్మ ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

సైదాపురం: అటవీ ప్రాంతానికి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడంతో అవి తగిలి ఓ ఆవు మంగళవారం మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు.. దాడిశెట్టికటపల్లె గ్రామానికి చెందిన మోడిబోయిన చినపాపయ్యకు చెందిన ఆవులు సమీపంలోని అటవీ ప్రాంతంలోకి మేతకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చేవి. ఈ క్రమంలో మంగళవారం అటవీ ప్రాంతం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా తీసిన విద్యుత్ తీగలు తగిలి ఓ ఆవు అక్కడికక్కడే మృతి చెందింది.

పరిశుభ్రతకు చర్యలు

ఓజిలి: గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని డీపీఓ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని భట్లకనుపూరులో చెత్తసంపద కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈయన వెంట ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ సిరాజ్‌బాషా తదితరులు ఉన్నారు.

మహిళా సాధికారతకు ప్రాధాన్యం


వెంకటగిరి: పొదుపు మహిళలకు నమూనా చెక్కు అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

• నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి


బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్ ఆసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో మున్సిపాలిటీ, వెంకటగిరి రూరల్ మండలం పరిధిలోని పొదుపు మహిళలకు చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, వెంకటగిరి ఎంపీపీ తనూజారెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కలిమిలి రామ్‌ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ దొంతు శారద, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్కా వేంకటేశ్వరరావు, పట్టణ కన్వీనర్ జి డిల్లీబాబు, జిల్లా సహాయ కార్యదర్శి చి ట్టేటి హరికృష్ణ, మహిళావిభాగం అధ్యక్షురాలు ధనియాల రాధమ్మ, న్యాయవాది ఎల్ కోటేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు సీహెచ్ ఉమామహేశ్వరి, ఎస్ బాలయ్య, విప్ పూజారి లక్ష్మి, సొసైటీ అధ్యక్షులు కెశ్రీనివాసులురెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలనలో కుల,మత పార్టీలకతీతంగా లబ్ధిదారుల అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బాలాయపల్లి మండలంలోని నిడిగల్లు పంచాయతీలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా? అని ఆరా తీశారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఇప్పటివరకు ఎంత మేరకు లబ్ధి పొందారన్న వివరాలను లబ్ధిదారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, వెంకటగిరి ఏఎంసీ చైర్మన్ సింగంశెట్టి భాస్కర్‌రావు, ప్రచారం విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు వెందోటి కార్తీక్‌రెడ్డి, రంగనాథం, దేవికచౌదరి, అల్లంశేఖర్ వైఎస్ ఎంపీపీ మురళీమోహన్‌రెడ్డి, సర్పంచ్ చప్పిడి గాయత్రి, గోపీకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు చెలికం రత్నమ్మ, వేళ్ల సురేంద్ర, నాయకులు చెలికం చిరంజీవిరెడ్డి, కోబాకు శ్రీనివాసుల రెడ్డి, దశరథరామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు హనుమంతరెడ్డి, శేషారెడ్డి, రాజారెడ్డి, మండల కన్వీనర్ బాపనపల్లి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

రూ.27.82 కోట్లతో బడ్జెట్


మాట్లాడుతున్న చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి

సూళ్లూరుపేట: స్థానిక మున్సిపాలిటీ వార్షిక బడ్జెట్ రూ.27.82 కోట్లతో ప్రవేశపెట్టారు. మున్సిపాలిటీ 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ సమావేశాన్ని స్త్రీ శక్తి భవన్‌లో చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఓపెనింగ్ బ్యాలెన్స్ రూ.5.32 కోట్లును చూపించారు. పురపాలక సంఘంలో పన్నుల రూపంలో రూ.6.64 కోట్లు, నాన్ టాక్స్ రిసోర్స్ రూ.4.85 కోట్లు, స్టాంప్ డ్యూటీ రూ.1.50 కోట్లు, ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంట్లు రూ. 9.50 కోట్లు కలుపుకుంటే మొత్తం రూ.27.82 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇందులో పేమెంట్లు రూ.26.52 కోట్లు కాగా సర్‌ప్లస్ రూ.1.30 కోట్లు నిల్వ ఉన్నట్లుగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. కౌన్సిలర్ మునీంద్రబాబు మాట్లాడుతూ న్యూస్ పేపర్లకు రూ.2లక్షలు కేటాయించడం ఏమిటని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బజారు వీధిలో పబ్లిక్ మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ చిన్ని సత్యనారాయణ కోరారు. చైర్మన్ శ్రీమంత్‌రెడ్డి మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో సూళ్లూరుపేట పట్టణం రూపు రేఖలను మార్చామన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ నాగిశెట్టి నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం


డీవైఈఓను సత్కరిస్తున్న వరగలి ఉపాధ్యాయులు

చిల్లకూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు గూడూరు డివిజన్‌లో సర్వం సిద్ధం చేసినట్లు డీవైఈఓ శివప్రకాష్ తెలిపారు. మండలంలో పది పరీక్షలు జరిగే చిల్లకూరు, తిక్కవరం, వరగలి జెడ్పీ హైస్కూళ్లలోని కేంద్రాలను మంగళవారం ఆయన తనిఖీ చేసి, అక్కడ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వరగలి జెడ్పీ హైస్కూలు టీచర్లు ఆయన్ని సత్కరించారు. హెచ్ఎంలు కోదండరామయ్య, రమణకుమార్, శివసుబ్రహ్మణ్యం ఉన్నారు.

పది పరీక్షలకు 5 కేంద్రాలు

కోట: పదో తరగతి పరీక్షల కోసం మండలంలో ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంఈఓ వెంకటసునీల్ మంగళవారం తెలిపారు. కోటలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు ఎస్సీ గురుకుల పాఠశాల, చిట్టేడు ఎస్టీ గురుకుల పాఠశాల, విద్యానగర్ బాలభారతి పాఠశాలలో పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశామన్నారు.

పాముకాటుకు బాలుడు మృతి


ఫక్రుద్దీన్(ఫైల్)

దొరవారిసత్రం: దుకాణంలో షాంపు ప్యాకెట్ తెచ్చేందుకు వెళ్లిన బాలుడు షేక్ ఫక్రుద్దీన్(6) నాగుపాము కాటుకు గురై మృతి చెందిన ఘటన సోమవారం మండలంలో మంగళవారం వెలుగుచూసింది. స్థానికుల కథనం మేరకు.. కల్లూరు గ్రామానికి చెందిన ఖలీల్, పర్వీన్ దంపతుల పెద్ద కుమారుడు ఫక్రుద్దీన్ తన ఇంటి ఎదురుగా రోడ్డుకు ఆటు పక్క ఉన్న దుకాణంలో షాంపు ప్యాకెట్‌కు వెళ్లి తీసుకువస్తున్న సమయంలో అక్కడ గోడలో ఉన్న నాగుపాము బాలుడిని కాటు వేసింది. దీన్ని గుర్తించిన వెంటనే స్థానికులు నాటు వైద్యం చేయించినా ఫలితం లేకపోయింది. దీంతో నాయుడుపేటలోని ఆస్పత్రికి తరలిస్తుండగా బాలుడు మృతి చెందాడు.

మహిళ ఆత్మహత్యాయత్నం

దొరవారిసత్రం: ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలోని కుప్పారెడ్డిపాళెం ఎస్సీకాలనీలో జరిగింది. స్థానికుల కథనం మేరకు.. కుప్పారెడ్డిపాళెం బీ శిరీష(25)అనే మహిళ వివాహేతర సంబంధం నడుపుతుందని అనుమానించి, అదే కాలనీకి చెందిన శ్రీలత, చాముండి, సుబ్బరత్నమ్మ మరి కొంత మంది ఆమె ఇంటికి వెళ్లి, కొట్టి గాయపరిచారు. దీంతో మనస్తాపం చెందిన శిరీష తలకు రాసుకునే సూపర్‌వ్యాస్మల్-33 తాగింది. గుర్తించిన స్థానికులు చికిత్స నిమిత్తం నాయుడుపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి ఆందోళకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం నెల్లూరులోని మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుమలరావు పేర్కొన్నారు.

కన్నీటి వీడ్కోలు


నివాళులర్పిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

రాపూరు: స్థానిక ఎంపీపీ చెన్ను బాలకృష్ణారెడ్డి పార్థివ దేహానికి మంగళవారం రాపూరు మండలం పోకురుపల్లెలో అశ్రునయనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. చెన్ను బాలకృష్ణారెడ్డి సోమవారం బెంగళూరులో గుండెపోటుతో మృతి చెందిన విషయం విదితమే. ఆయన మృతదేహానికి స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఆనం విజయకుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దండోలు లక్ష్మీనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డి, పార్టీ ప్రచార విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నెల్లూరు రవీంద్రారెడ్డి పోకురుపల్లెకు వెళ్లి చెన్ను బాలకృష్ణారెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించి,వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.

5న సైదాపురంలో నేదురుమల్లి పర్యటన


స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నేతలు

సైదాపురం: మండల కేంద్రానికి వచ్చే నెల 5వ తేదీ వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కు పంపిణీ సంబరాలకు వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి విచ్చేస్తారని జేసీఎస్ కన్వీనర్ మన్నారపు రవికుమార్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సమావేశం ఏర్పాటు చేసే స్థలాన్ని మంగళవారం ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏపీఎం రాధ పరిశీలించారు.